# సిరిసిల్ల వాసులను కలచివేసిన మూడో సంఘటన





**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్లను కలచివేసిన మూడో విషాద సంఘటన ఇది. శుక్రవారం హైదరాబాద్ ఓఆర్ఆర్ పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఒకే కుటుంబంలోని ఆరుగురు మృత్యువాతకు గురై శనివారం శవాలుగా తిరిగి వచ్చిన ఘటనలో సిరిసిల్ల పట్టణం బంధుమిత్రులు శ్రేయోభిలాషులతో కన్నీటి సంద్రమైంది. 2001లో సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు పూర్ణచందర్ కుటుంబ సభ్యులు పుట్టపర్తి సాయిబాబా దర్శనానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందారు. ఇదే కోవలో సిరిసిల్ల పట్టణంలో వస్త్ర వ్యాపారి, మాజీ ఎంపీపీ కొండా శంకరయ్య సోదరుడు కొండ నారాయణ కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఏకంగా తొమ్మిది మంది మృత్యు వాతకు గురయ్యారు. తాజాగా సిరిసిల్ల పట్టణానికి చెందిన బీడి కంపెనీ టేకేదార్ బొల్లి రాజు కుటుంబంలోని ముగ్గురు చిన్నారులతో సహా కొడుకు, కోడలు, అల్లుడు, ఇద్దరు మనుమలు, ఒక మనమరాలితో ఏకంగా ఆరుగురు సభ్యులను ఓఆర్ఆర్ రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. బొల్లి రాజు కుటుంబ సభ్యుల మృత్యువాతతో మళ్లీ పాత జ్ఞాపకాలను సిరిసిల్ల పట్టణవాసులను తీవ్రంగా కలిచి వేసింది. బీడి కంపెనీ ద్వారా అనేక మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ వారి అభిమానాన్ని చూరగొన్న రాజు, కుటుంబ అభివృద్ధి కోసం శ్రమిస్తూనే కొంతకాలంగా అనారోగ్యంతోనే ఉన్న రాజు కుటుంబానికి శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఊహించనంత దెబ్బకు గురిచేసింది. మృతదేహాలు శనివారం మధ్యాహ్నం సిరిసిల్లకు చేరుకోగానే బంధుమిత్రులు, స్నేహితులు, బీడీ కార్మికులు, రాజకీయ నాయకులు తరలివచ్చి మృతదేహాలను చూసి చలించిపోయారు. రాజు, అతడి భార్య భాగ్యలక్ష్మి దంపతులను ఓదార్చే స్థితిలో ధైర్యాన్ని భరోసాను నింపే ప్రయత్నాలు చేసినప్పటికీ వారి రోదనలకు అంతులేకుండా పోయింది.

- ఆరు మృతదేహాలను చూసి కన్నీటి సంద్రమైన స్థానికులు
- ఓఆర్ఆర్ రోడ్డు ప్రమాద మృతదేహాలు సిరిసిల్లకు రాక
- ఆరు భౌతికకాయాల అంతిమయాత్ర, దహన సంస్కారాలు పూర్తి
- భౌతికకాయలకు నివాళి అర్పించిన కేటీఆర్

### అంతిమయాత్ర

బొల్లి శివకుమార్, భార్య లాస్య అలియాస్ రాజేశ్వరి, కూతురు రిషిత, కోడం శ్రీనివాస్, వీరి కుమారులు కృష్ణచంద్ర, మాధవ్ ల భౌతిక కాయాలకు శనివారం సాయంత్రం అంతిమయాత్ర నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల మున్సిపల్ స్మశాన వాటికలో దహన సంస్కారాలు పూర్తి చేశారు.

### చికిత్స పొందుతున్న శ్వేత

ఓఆర్ఆర్ రోడ్డు ప్రమాదానికి ఏడుగురు గురికాగా అందులో ఆరుగురు అక్కడికక్కడే మృత్యువాతకు గురైన విషయం తెలిసిందే. బొల్లి రాజు కూతురు కోడం శ్వేత అలియాస్ తేజశ్రీ మాత్రమే తీవ్ర గాయాలతో బయటపడింది. హుటాహుటిన ఆమెను హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స కొనసాగుతున్నది. తన ఇద్దరు కుమారులు ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. వేరే ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నట్టుగా శ్వేతకు నచ్చ చెప్పినట్టు స్థానికులు చెప్పారు.



### భౌతికకాయాలకు కేటీఆర్ నివాళి

ప్రమాద మృతులకు శనివారం ఉదయం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల శాసనసభ్యులు కే తారక రామారావు ఆసుపత్రికి వెళ్లి భౌతికకాయాలపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బొల్లి రాజును, ఆయన సోదరుడు, బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

### సిరిసిల్లలో నేతలు, ప్రజాప్రతినిధుల నివాళి

ప్రమాద మృతుల భౌతికకాయల వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగారావు, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, కౌన్సిలర్ లు ఆకుల స్వప్న కృష్ణ, గెంట్యాల శ్యామల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మ్యాన రవి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి తదితర ప్రజాప్రతినిధులు నాయకులు నివాళులర్పించి వారి సంతాపాన్ని తెలియజేస్తూ బొల్లి రాజు, బొల్లి రామ్మోహన్ సోదరులను వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# వార్పిన్ కార్మికుల కూలి పెంచాలి




- మే 4న కలెక్టరేట్ వద్ద ధర్నా
- సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి
- సమ్మె శిబిరంలో మద్దతు తెలిపిన ఎల్లారెడ్డి

**ప్రజానావ, సిరిసిల్ల :** వార్పింగ్ కార్మికుల కూలీ పెంపు కొరకు మే 4న కలెక్టర్ ఆఫీసు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. అన్నారు. శనివారం కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరం వద్దకు ఎల్లారెడ్డి వచ్చి మద్దతు తెలియపరుస్తూ యజమాన్యం మొండి వైఖరి మానుకొని వెంటనే వార్పిన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. చాలామంది యజమానులు కూలీ పెంచడానికి ఎలాంటి అభ్యంతరాలు తెలుపకపోయినా కొందరు పెద్ద యజమానులు కావాలని సమ్మె కొనసాగాలని అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు సిరిమల్ల సత్యం, గౌరవాధ్యక్షులు ఉడుత రవి, మచ్చ వేణు, ఐరన్ ప్రవీణ్, సామల నరసయ్య, సామల శ్రీనివాస్, బూట్ల వెంకటేశ్వర్లు, కూరపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి సన్మానం

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం బొజ్జపల్లికి గ్రామానికి చెందిన మహమ్మద్ సిద్ధిక్ ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షల్లో 579 మార్కులు సాధించి ఎస్సార్ ప్రైమ్ కురిక్యాల బ్రాంచ్ స్కూల్ టాపర్‌గా నిలిచాడు. అలాగే గంగాధర మండల టాపర్‌గా నిలవడంతో సిద్ధిక్‌ను ఐదో వార్డు కౌన్సిలర్ లావణ్య వాసాల శ్రీనివాస్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని సిద్ధిక్‌ను అభినందించారు.



# ధాన్యం కొనుగోలులో గందరగోళం

**ప్రజానావ, మహబూబాబాద్:** కురవి మండల కేంద్రంలోని ధాన్య కొనుగోలు కేంద్రాన్ని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం, తగిన సౌకర్యాల లేమి, తూకం విషయంలో అవ్యవస్థలపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ తీవ్రంగా స్పందిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండించారు. ధాన్యం కొనుగోలులో పారదర్శకత పాటించాలని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను హెచ్చరించారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు.



## గుర్తు తెలియని బాలుడు



**ప్రజానావ, నారాయణపేట:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో ఒక గుర్తుతెలియని బాలుడు ఒంటరిగా కనిపిస్తున్నాడు. ఆ అబ్బాయి తన పేరు గానీ, ఇతర వివరాలు గానీ చెప్పలేకపోతున్నాడు. ప్రస్తుతం ఆ బాలుడు మరికల్ గ్రామంలోని వై.డి. గుప్తా కిరాణం షాపు వద్ద ఉన్నాడు. కావున, ఎవరైనా ఈ బాలుడిని గుర్తిస్తే లేదా ఆ బాలుడి కుటుంబ సభ్యుల సమాచారం తెలిస్తే, వెంటనే వచ్చి బాబును తీసుకెళ్లాలని లేదా సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఈ సమాచారాన్ని సాధ్యమైనంత వరకు అందరికీ చేరవేసి, బాలుడు సురక్షితంగా ఇంటికి చేరేలా సహకరించగలరు.

## రాకోండా పంచాయతీ కార్యదర్శిగా తిరుపతమ్మ



**ప్రజానావ, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని రాకోండా గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా తిరుపతమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో నర్వ మండలంలోని జక్కనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. కాగా, గతంలో రాకోండా గ్రామ పంచాయతీకి ఇన్చార్జి కార్యదర్శిగా పనిచేసిన అనిత, బదిలీపై పూసలపాడు గ్రామానికి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతమ్మకు గ్రామ పంచాయతీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## చేతి పంపుకు పునర్జీవం

### సమస్యపై కథనానికి స్పందించిన సర్పంచ్



**ప్రజానావ, ఎండపల్లి:** నెలల తరబడి మరమ్మతులు లేక నిరుపయోగంగా మారిన గుల్లకోట గ్రామ శివారు (సలాంద్రి మర్రి) ప్రాంతంలోని చేతి పంపుకు సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ప్రత్యేక చొరవతో పునర్జీవం లభించింది. వేసవి కాలంలో బాటసారులు, స్థానికుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేతి పంపుకు మరమ్మతులు చేపించి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను ప్రస్తావిస్తూ నేటి సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన సర్పంచ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, సంబంధిత సిబ్బందితో శనివారం చేతి పంపును మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచడంతో స్థానికులు, బాటసారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో తాగునీటి సౌకర్యం పునరుద్ధరణ కావడం తమకు ఎంతో ఊరటనిచ్చిందని గ్రామస్తులు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన మీడియాకు, స్పందించి పరిష్కారం చూపిన సర్పంచ్‌కు అభినందనలు వెల్లివిరిశాయి.

## గజ్వేల్‌లో చెస్ వేసవి శిక్షణ శిబిరం



**ప్రజానావ, గజ్వేల్ :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సిద్దిపేట వారి ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస డెంటల్ అండ్ మెటర్నిటీ హాస్పిటల్ ప్రాంగణంలో చెస్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ చెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ మరియు కార్యదర్శి, శిక్షణ శిబిరం కోచ్ PD టి. ఎలియాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరం తేదీ 05-05-2026 నుండి జూన్ 10 వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. 10 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు ప్రతిరోజూ సాయంత్రం 4:30 గంటల నుండి 6:00 గంటల వరకు చెస్ క్రీడలో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, వారానికి రెండు సార్లు హైదరాబాద్ నుండి అనుభవజ్ఞులైన చెస్ కోచ్‌లను పిలిపించి శిక్షణలో పాల్గొనే వారికి ప్రత్యేక శిక్షణ అందించి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనే విధంగా తర్ఫీదు ఇస్తున్నట్లు వారు తెలిపారు. జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనదలచిన వారు తమ వ్యక్తిగత చెస్ బోర్డుతో హాజరై, 9989170936 నంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో PD రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

